లక్ష్యం దిశగా 'ఆయిల్‌పామ్‌'

- జిల్లాలో కొనసాగుతున్న అవగాహన సదస్సులు
- టార్గెట్‌ 1,600 ఎకరాలు
- ప్రస్తుతం1,274 ఎకరాల్లో సాగు



గంభీరావుపేటలో ఆయిల్‌పామ్‌ తోటలో అంతర పంట

గంభీరావుపేట(సిరిసిల్ల): వరి, పత్తి పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్‌ తోటలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోంది. రాయితీపై మొక్కలు, ఎరువులు అందించడంతో పాటు ఈజీఎస్‌ ద్వారా గుంతలు తీయించి మొక్కలు నాటిస్తోంది. ఆయిల్‌పామ్‌ సాగుపై రైతులను చైతన్యపరిచేందుకు ఉద్యానవన, వ్యవసాయశాఖలు సంయుక్తంగా ఈ నెల 16 నుంచి 26 వరకు ఊరూరా అవగాహన సదస్సులు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు. జిల్లా వ్యాప్తంగా రైతువేదికల్లో సదస్సులు కొనసాగుతున్నాయి.

అవగాహన అంశాలు

ఆయిల్‌పామ్‌ సాగుతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరిస్తున్నారు. పంట దిగుబడి, మార్కెటింగ్‌ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. వడగళ్లు, ప్రకృతి వైపరీత్యాలను ఆయిల్‌పామ్‌ తోటలు తట్టుకుంటాయని రైతులు ఆసక్తి చూపాలని కోరుతున్నారు. ఒక్కసారి మొక్కలు నాటితే సుమారు 25 నుంచి 30 ఏళ్ల వరకు దిగుబడి పొందే అవకాశం ఉంటుందంటున్నారు. ఆయిల్‌పామ్‌ శుద్ధి కోసం ప్రభుత్వం కంపెనీలను సైతం ఎంపిక చేసి వారి సమక్షంలోనే అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో ఆయిల్‌పామ్‌ సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలో అధికారులు సాగు విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తున్నారు. రైతులకు మొక్కలు, డ్రిప్‌లను సబ్సిడీపై అందిస్తున్నారు. జిల్లాలో 1,600 ఎకరాల్లో సాగు లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం 1,274 ఎకరాల్లో పంట సాగవుతోంది.

చిన్న, సన్నకారు రైతులకు ఊరట

ఆయిల్‌పామ్‌ సాగుకు ప్రభుత్వం రాయితీలు అందించడంతో పాటు మొక్కలు నాటడం, రవాణా తదితర పనులను ఉపాధి పథకానికి అనుసంధానం చేసింది. ఒక్కో ఆయిల్‌పామ్‌ మొక్కకు గుంత తీసి నాటేందుకు రూ.100 ఖర్చవుతోంది. ఎకరాకు 57 మొక్కలకు రూ.5,700 వెచ్చించాల్సి వస్తోంది. అలాగే నర్సరీ నుంచి మొక్కల రవాణాకు రూ.2,500, ఎరువులకు రూ. 2వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. డ్రిప్‌ పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్నా జీఎస్టీ రైతులే చెల్లించాలి. ఇలా రైతుల ఖర్చును దృష్టిలో పెట్టుకొని ఆయిల్‌పామ్‌ సాగును మరింత పెంచడానికి 'ఉపాధి'తో చేయూతనందిస్తోంది. దీంతో చిన్న, సన్న కారు రైతులకు ఖర్చులు తగ్గనున్నాయి. ఐదెకరాలలోపు సాగు చేసే ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం, బీసీ, జనరల్‌ రైతులకు 90శాతం రాయితీ ఉంది.

16 ఎకరాల్లో సాగు చేస్తున్న..



గంభీరావుపేట మండలం భీమునిమల్లారెడ్డిపేటలో 16 ఎకరాల్లో ఆయిల్‌పామ్‌ సాగు చేస్తున్నా. పంట కొనుగోలుకు ప్రియూనిక్‌ సంస్థ ముందుకు వచ్చింది. ఆయిల్‌పామ్‌ సాగుతో ప్రయోజనాల గురించి అధికారులు వివరంగా తెలియజేస్తున్నారు.

– కొమిరిశెట్టి లక్ష్మణ్‌, గోరింటాల

రైతులను ప్రోత్సహిస్తున్నాం



ఆయిల్‌పామ్‌ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. గుంతలు తీయడం, నాటడం, డ్రిప్‌ తదితర ఖర్చులన్నీ ఉపాధి నిధుల నుంచి అందజేస్తారు. జాబ్‌కార్డు ఉన్నవారికి ప్రయోజనం చేకూరనుంది. ఆసక్తిగల రైతులు ఎంపీడీవోల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

– జ్యోతి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి

రుణాలు అందిస్తాం



ఆయిల్‌పామ్‌ సాగుకు సహకార బ్యాంకుల ద్వారా రుణాలు అంది స్తాం. ఎకరాకు రూ.50వేలు ఇచ్చి నాలుగేళ్ల వరకు రికవరీ చే యం. అలాగే అంతరపంటల సాగుకు పంట రకాన్ని బట్టి రుణాలు అందిస్తాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– కొండూరు రవీందర్‌రావు,టెస్కాబ్‌ చైర్మన్‌

వీవోఏ సమస్యలు పరిష్కరించాలి



రవీందర్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న వీవోఏలు

- టెస్కాబ్‌ చైర్మన్‌కు వీవోఏల వినతిపత్రం

గంభీరావుపేట: తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల వీవోఏలు గురువారం టెస్కాబ్‌ చైర్మన్‌ కొండూరు రవీందర్‌రావుకు వినతిపత్రం అందించారు. వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు దేవలక్ష్మి ఆధ్వర్యంలో మండలంలోని వీవోఏలు సహకార సంఘ కార్యాలయంలో రవీందర్‌రావును కలిసి తమ సమస్యలను విన్నవించారు. వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని కోరారు. మంత్రి కేటీఆర్‌ ద్వారా డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు.

కంటి వెలుగులో 1,256 మందికి పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలో కంటి వెలుగు–2లో భాగంగా గురువారం 1,256 మందికి కంటి పరీక్షలు చేసినట్లు జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు తెలిపారు. వీరిలో 159 మందికి రీడింగ్‌ అద్దాలను, 68 మందికి పాయింట్‌ అద్దాలను అందించినట్లు తెలిపారు. 26 ప్రాంతాల్లో 234 మంది వైద్య సిబ్బంది శిబిరాల్లో పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 83 రోజులుగా 3,10,649 మందికి కంటి పరీక్షలు చేసినట్లు ఇప్పటి వరకు 49,525 మందికి రీడింగ్‌ అద్దాలు, 42,290 పాయింట్‌ అద్దాలను అందించినట్లు వివరించారు.

కంటి వెలుగుకు విశేష స్పందన

- మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మాధవి
- వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లకు సన్మానం



సన్మానిస్తున్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మాధవి

వేములవాడఅర్బన్‌: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేషస్పందన లభించిందని వేములవాడ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ రామతీర్థపు మాధవి అన్నారు. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం 100 రోజులకు ముగింపు కార్యక్రమాన్ని వేములవాడలోని 13వ వార్డు కొనాయపల్లిలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవలను అందించిన ఆశ వర్కర్లను, వైద్య సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేములవాడ మున్సిపల్‌లోని 28 వార్డుల్లో ప్రతి వార్డులో ఐదు రోజుల పాటు కంటి వెలుగు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని వార్డులు కలిపి 21 వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, నాలుగు వేల మందికి కంటి అద్దాలను, 3,030 మందికి కంటి అద్దాల కోసం ఆర్డర్‌ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్న ప్రజలకు ధన్యావాదములు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, మున్సిపల్‌ కమిషనర్‌ అన్వేశ్‌, కౌన్సిలర్‌ గడ్డమీది లావణ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'బాలసాహిత్యంలో పరిశోధనలు రావాలి'



ప్రసంగిస్తున్న పర్శరాములు

ఎల్లారెడ్డిపేట: బాల్యం అమూల్యమైందని, బాల్యాన్ని చక్కగా మలుచాలంటే ఉత్తమ బాలసాహిత్యం అవసరమని.. బాలసాహిత్యంలో విస్తృత పరిశోధనలు జరగాలని తెలంగాణ వివేక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసరవేని పర్శరాములు పేర్కొన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఈనెల 24, 25 తేదీల్లో నిర్వహించిన బాలసాహిత్యం సమ్మేళనంలో మాట్లాడారు. బాలసాహిత్యకారులు బాలల వికాసం కోసం రచనలు చేయాలని కోరారు.

భూమిపూజ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న చక్రపాణి

సిరిసిల్లఅర్బన్‌: హైదరబాద్‌ కోకాపేట్‌లో ఈనెల 27న నిర్వహించనున్న పద్మశాలీ ఆత్మగౌరవ భూమిపూజ కార్యక్రమానికి కులబాంధవులు హాజరై విజయవంతం చేయాలని టీఎస్‌పీటీడీసీ చైర్మన్‌ గూడూరి ప్రవీణ్‌, బీఆర్‌ఎస్‌ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి పిలుపునిచ్చారు. గురువారం రాత్రి పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. కార్యక్రమంలో సంఘం నాయకులు, తదితరులు ఉన్నారు.

వసతుల కల్పన యజమానుల బాధ్యత



కార్మికులకు పండ్లు అందజేస్తున్న పోలీసులు

సిరిసిల్లటౌన్‌: ఇటుక బట్టీలలోని కార్మికులు, వారి పిల్లలకు వసతుల కల్పన యజమానులదే బాధ్యత అని పోలీస్‌ అధికారులు పేర్కొన్నారు. జిల్లాలోని ఇటుకబట్టీలలో రెండు రోజులుగా పోలీసులు తనిఖీలు చేసి యజమానులతో సమావేశమయ్యారు. పిల్లలతో పనిచేయించొద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కార్మికులకు పండ్లు పంపిణీ చేశారు. సీఐలు అనిల్‌కుమార్‌, ఉపేందర్‌, ఎస్‌ఐలు శ్రీకాంత్‌, లక్ష్మారెడ్డి ఉన్నారు.

క్రీడాకారులకు సన్మానం



క్రీడాకారులను సత్కరిస్తున్న పూసల సంఘం సభ్యులు

సిరిసిల్లఅర్బన్‌: జిల్లా స్థాయి సీఎం కప్‌ 2023 జరిగిన వాలీబాల్‌ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ఎంపికైన క్రీడాకారులు ముద్రకోల అఖిల, అర్చనను జిల్లా పూసల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ముద్రకోల ఆంజనేయులు, జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ లక్ష్మణ్‌, ఉపాధ్యక్షుడు నారాయణ, గణేశ్‌, శ్రీధర్‌ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలి



ఉయ్యాలలు అందిస్తున్న డాక్టర్‌ మహేశ్‌రావు

వేములవాడఅర్బన్‌: వేములవాడ ఏరియా ఆసుపత్రి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రేగులపాటి మహేశ్‌రావు అన్నారు. వేములవాడ ఏరియా ఆసుపత్రిలో మొదటి కాన్పులో నార్మల్‌ డెలివరీలో ఆడబిడ్డ జన్మించిన రవళి, మానస, శిరీష, నగ్మాలకు ఉయ్యాలలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు ఏరియా ఆసుపత్రికి వచ్చి నెల, నెలకు ఆసుపత్రిలో చూపించుకుని నార్మల్‌ డెలివరీ కోసం అవసరమైన యోగ, వ్యాయామం చేయడం వల్ల సాధారణ ప్రసవం అయ్యే అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు చైతన్యసుధ, సంతోష్‌, తిరుపతి, దీప్తి, బింధు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.25,016 విరాళం



విరాళం అందిస్తున్న చీటి నర్సింగారావు

సిరిసిల్ల: శ్రీశాల శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు చీటి నర్సింగారావు రూ.25,016 విరాళాన్ని గురువారం ఆలయ ఈవో మారుతీరావు, ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు చేపూరి నాగరాజు, ఉప్పుల విఠల్‌రెడ్డి, ఆలయ అధికారి ప్రభాకర్‌ పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్య చర్యలు చేపట్టాలి



పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో రమాదేవి

ముస్తాబాద్‌: ముస్తాబాద్‌ పట్టణంలో సంపూర్ణ పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఎంపీడీవో రమాదేవి ఆదేశించారు. మేజర్‌ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సిబ్బందితో గురువారం చెత్త సేకరణపై సమీక్ష నిర్వహించారు. రోజురోజుకు పెరుగుతున్న పట్టణంలో ప్రధాన వీధులతోపాటు చిన్న కాలనీల్లో కూడా చెత్తను సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా హోటళ్లు, దుకాణాలలో ప్లాస్టిక్‌ వినియోగం చాలా ఉందని, ఈ విషయంలో ప్లాస్టిక్‌ కవ్వులు, బ్యాగులు వినియోగించే వారికి నోటీసులు ఇవ్వాలన్నారు. పారిశుధ్య సిబ్బందికి తగిన విశ్రాంతి ఇస్తూ, ప్రణాళికాబద్ధంగా చెత్త సేకరణ, చికెన్‌ వ్యర్థాలు సేకరించాలన్నారు. ఎంపీవో ఆరీఫ్‌, పంచాయతీ కార్యదర్శి రాజు, జూనియర్‌ అసిస్టెంట్‌ బిక్షపతి, జగన్‌ పాల్గొన్నారు.

పవర్‌ కట్‌

విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

తంగళ్లపల్లి: మండలంలోని రాళ్లపేట సబ్‌స్టేషన్‌ ఫీడర్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్‌ ఏఈ ప్రశాంత్‌ ఒక ప్రకటనలో తెలిపారు. తంగళ్లపల్లి మండలంలోని రాళ్లపేట, తంగళ్లపల్లి, కస్బేకట్కూర్‌, జిల్లెల్ల, నేరెళ్ల, అంకిరెడ్డిపల్లె సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నియామకం

బీజేవైఎం మండల అధ్యక్షుడిగా విఘ్నేష్‌గౌడ్‌

గంభీరావుపేట: మండల బీజేవైఎం అధ్యక్షుడిగా నామాపురం విఘ్నేశ్‌గౌడ్‌ను నియమిస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్‌ గురువారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని విఘ్నేష్‌గౌడ్‌ తెలిపారు.

మాల సంఘం ఎన్నిక

కోనరావుపేట: మండలం సుద్దాలలో మాల సంఘం అధ్యక్షుడిగా కాదాస్‌ సుధాకర్‌ ఎన్నికయ్యారు. గురువారం సమావేశమైన సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కాదాస్‌ శ్రీనివాస్‌, ప్రధానకార్యదర్శిగా కాయితీ కరుణాకర్‌, కార్యవర్గసభ్యులుగా నీరటి రవి, సంజీవ్‌, మాసం రంజిత్‌, లింగయ్య ఎన్నికయ్యారు.

తీర్మానానికి విరుద్ధంగా ఇళ్ల కేటాయింపులు

- 'డబుల్‌' ఇళ్ల పంపిణీపై వార్డు సభ్యుల గరం గరం

ముస్తాబాద్‌: ముస్తాబాద్‌లో డబుల్‌ బెడ్రూం ఇళ్ల కేటాయింపులపై పంచాయతీ తీర్మాణాలు చెల్లవని రెవెన్యూ అధికారులు అంటున్నారని సర్పంచ్‌ గాండ్ల సుమతి ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌ విలేకరులతో గురువారం మాట్లాడుతూ ముస్తాబాద్‌లో మంత్రి కేటీఆర్‌ కృషితో 154 డబుల్‌ బెడ్రూం ఇళ్లు నిర్మించామన్నారు. 148 ఇళ్ల వరకు మంత్రి కేటీఆర్‌ చేతుల మీదుగా పంపిణీ చేశామన్నారు. మిగిలిన ఇళ్లను నలుగురు పేదలకు, అర్హులకు కేటాయిస్తూ గతేడాది జనవరి 18న గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసిందన్నారు. ఈ కాపీని కలెక్టర్‌, ఆర్డీవోలకు సైతం పంపించామన్నారు. ఈ రెండు కుటుంబాల పేర్లు అందులో ఉంటున్నాయని, రెవెన్యూ అధికారులు గురువారం వారి ఇళ్ల తాళాలు పగలగొట్టి ఇద్దరికి కేటాయిస్తున్నట్లు చెప్పారని సర్పంచ్‌ ఆరోపించారు. తాము తీర్మానం చేశామని చెప్పినా తమకు ఇష్టం వున్న వారికే కేటాయిస్తామని అధికారులు అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల తీరుపై వార్డు సభ్యులు కూడా స్పందించారు. పంచాయతీ తీర్మానానికి విలువ లేదా? అని ప్రశ్నిస్తూ, కలెక్టర్‌ స్పందించి న్యాయం చేయాలని కోరారు.

బాల్‌రాజ్‌గౌడ్‌ మృతి పార్టీకి తీరనిలోటు



బాల్‌రాజ్‌గౌడ్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన కాంగ్రెస్‌ గ్రామశాఖ అధ్యక్షుడు పందిర్ల బాల్‌రాజ్‌గౌడ్‌ మృతి పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. బాల్‌రాజ్‌గౌడ్‌ కుటుంబ సభ్యులను గురువారం ఆయన పరామర్శించి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్‌రాజ్‌గౌడ్‌ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారన్నారు. పార్టీ ఒక మంచి నాయకున్ని కోల్పోయిందన్నారు. మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు గౌస్‌, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దత్తాద్రిగౌడ్‌, పోచయ్య ఉన్నారు. అలాగే జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌ గౌడ్‌ పరామర్శించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

గంభీరావుపేట: మండలం గోరింటాలలో పలువురు లబ్ధిదారులకు గురువారం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, సర్పంచ్‌ అంజమ్మ, ఎంపీటీసీ అంజిరెడ్డి, ఉపసర్పంచ్‌ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌ సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

గంభీరావుపేట: మండలంలోని భీమునిమల్లారెడ్డిపేట రైతువేదికలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్‌ సాగుపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్‌ ప్రాముఖ్యత, ప్రభుత్వం అందించే రాయితీల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ శెట్టి మహేశ్వరి, ఎంపీటీసీ రాజేందర్‌, ఆర్‌బీఎస్‌ మండల కన్వీనర్‌ రాజేందర్‌, ఏఈవో అజయ్‌, ఉపసర్పంచ్‌ ఆంజనేయులు, ఆర్‌బీఎస్‌ గ్రామ కోఆర్డినేటర్‌ పాతూరి శ్రీనివాస్‌, కంపెనీ ప్రతినిధి సతీశ్‌, రైతులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల బెడద ఉండదు

రుద్రంగి: ఆయిల్‌పామ్‌ పంటను సాగు చేస్తే వన్యప్రాణుల బెడద ఉండదని రుద్రంగి వైస్‌ఎంపీపీ పీసరి చిన్న భూమయ్య అన్నారు. గురువారం రుద్రంగి మండల మానాల రైతు వేదికలో వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ అధికారులతో కలిసి ఆయన రైతులకు ఆయిల్‌పామ్‌ సాగుపై అవగాహన కల్పించారు. ఈ పంట సాగు వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమల అధికారులు, కంపెనీ క్లస్టర్‌ అధికారి, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

మహాజన్‌ సంపర్క్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న రెడ్డబోయిన గోపి

తంగళ్లపల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను మండలంలోని ప్రతి ఇంటికి, గడప గడపకు చేరవేయాలని బీజేపీ నాయకులకు జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని మార్కండేయ ఫంక్షన్‌ హాలులో నిర్వహించిన బీజేపీ మండల నాయకుల సమావేశంలో గోపి మాట్లాడారు. గోపి మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి వచ్చే నెల 30 వరకు మహాజన్‌ సంపర్క్‌ కార్యక్రమం ఉంటుందన్నారు. నెల రోజులపాటు కార్యకర్తలు ప్రజల్లో ఉండాలని, ప్రజలకు కేంద్ర పథకాలు వివరించాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సురువు వెంకట్‌, ప్రధాన కార్యదర్శి అమరగొండ రాజు, బీజేవైఎం అధ్యక్షుడు కోల ఆంజనేయులు, మహిళా మోర్చ అధ్యక్షురాలు కోడం భవిత, నాయకులు పాల్గొన్నారు.

బూత్‌ కమిటీలు ప్రజలతో ఉండాలి

బోయినపల్లి: బూత్‌ కమిటీలు ప్రజలతో మమేకమై కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఉదారి నర్సింహచారి, కొనుకటి హరీశ్‌, సారంపల్లి రాజు, జనగం లక్ష్మణ్‌, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై వ్యాపారాలు చేస్తే చర్యలు

- ముస్తాబాద్‌ ఎస్సై వెంకటేశ్వర్లు



చిరువ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్సై

ముస్తాబాద్‌: పట్టణంలో రోడ్లపై, ప్రధాన కూడళ్లలో వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ముస్తాబాద్‌లోని రాజీవ్‌ చౌక్‌, తెలంగాణ చౌక్‌, మార్కెట్‌ ఏరియాల్లో ఫూట్‌పాత్‌పైనే వ్యాపారాలు చేస్తున్నారన్నారు. గురువారం చిరువ్యాపారులతో ఎస్సై మాట్లాడుతూ ప్రధాన కూడళ్లలో మలుపుల వద్ద రహదారులను ఆక్రమించుకుని తోపుడు బండ్లు, ఇతర వ్యాపారాలు చేయడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్‌ నిబంధనలకు విరుద్ధంగా ఎవరు ప్రవర్తించవద్దన్నారు. దుకాణాల ఎదుట పార్కింగ్‌తో ట్రాఫిక్‌ సమస్య వస్తోందన్నారు. వాహనాదారులు కూడళ్లలో వాహనాలను నిలపరాదన్నారు. చిరు వ్యాపారులు సహకరించి, ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు.